క్లుప్తంగా

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకోవాలని కోరారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

తిరుమలకు పాదయాత్ర



కాలినడకన వెళ్తున్న భక్తులు

గుడిపాల: తమిళనాడు భక్తులు తిరుమల యాత్రకు పాదయాత్రగా వెళ్తున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై నుంచి తిరుమలకు కాలినడకన భక్తులు వెళ్తున్నారు. పెరటాసి నెల ప్రారంభం కానుండడంతో తమిళ భక్తులు అధిక సంఖ్యలో కాలినడకన తిరుమలకు వెళ్తుంటారు. ఇందులో భాగంగా ఆదివారం భక్తులు తిరుమలకు కాలినడకన వెళ్తూ కొంతసేపు గుడిపాలలో సేదతీరారు. ప్రతి సంవత్సరం కాలినడకన తిరుమలకు వెళ్తుంటామని వారు తెలియజేశారు.

మునీశ్వరుడికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో ఆదివారం గ్రామస్తులు మునీశ్వర పూజలను ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో గ్రామ వీధుల్లో మహిళలు పొంగళ్లు తీసుకుని మునీశ్వర ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పలమనేరు గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమం

పలమనేరు: పిల్లలు స్మార్ట్ ఫోన్లను పక్కన పెట్టి పుస్తకాలు చదవాలని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు జయంతిని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పుస్తకాలే కాకుండా వార్తా పత్రికలను చదవడానికి సైతం జనానికి ఆసక్తి లేకుండా పోతోందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలలో పఠనాసక్తిని పెంపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు.



రంగుల గౌళి

బోయకొండలోని శ్రీ రణభేరి గంగమ్మ ఆలయంలో ఆదివారం పెద్ద ఆకారంలో గల బల్లి(గౌళి)ని భక్తులు గుర్తించారు. సాధారణంగా బల్లి చిన్నదిగా ఉంటుంది. ఆలయంలో ఉన్న బల్లి పెద్దదిగా ఉండడంతో పాటు పసుపు రంగులో ఉంది. బల్లిని చూసిన భక్తులు పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. -చౌడేపల్లె

ఖాళీ స్థలాలు.. భయం గుప్పెట్లో స్థానికులు



- నగరంలో పలుచోట్ల చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ జాగాలు
- మరికొన్ని చోట్ల మురికి కూపాలుగా మారిన వైనం
- దోమలు, విషసర్పాలకు ఆందోళన చెందుతున్న ప్రజానీకం
- అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలు ఇవే



తేనెబండ రోడ్డులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, (ఇన్‌సెట్) తేనెబండలో నివాసాల మధ్య చేరిన మురుగునీరు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాలు.. పలుచోట్ల ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి విషపూరిత, ప్రాణాలను హరించే అడవి జంతువులకు ఆవాసంగా మారడంతో స్థానికంగా నివాసం ఉంటున్నవారు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఖాళీస్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల విజృంభణ పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. అంతేగాకుండా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోవడంతో విష సర్పాలకు నిలయాలుగా మారాయని, ఖాళీ స్థలాలను ఆనుకుని ఉన్న భవనాల్లోకి సైతం విషసర్పాలు గోడలపై నుంచి పాకుతూ ప్రవేశిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

అంతా పిచ్చిమొక్కలు..

నగరంలో ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగిపోయి, మురుగునీటితో నిండి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో పగలూ రాత్రి తేడా లేకుండా దోమలు బాధిస్తున్నాయని స్థానిక నివాసితులు ఆందోళన చెందుతున్నారు. దోమల దాడితో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని, చిన్నారులను వాటి నుంచి ఏ రకంగా రక్షించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అటువైపుగా వెళ్లే వారు చెత్తాచెదారాలను అందులో వేస్తున్నారని చెబుతున్నారు. ఆకతాయిలకు అడ్డాగా ఆ స్థలాలు మారుతున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగునీరు అక్కడ నిల్వ చేరుతోంది.

మురుగు వల్లే దోమలు..

అంతేగాకుండా పల్లంగా ఉన్న ఖాళీస్థలాల్లో మురుగునీరు నిల్వ చేరి దుర్గంధానికి నిలయంగా మారాయని దీంతో ఆ దుర్వాసనకు ఇళ్లలో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రధానంగా తేనెబండ, వీరభద్ర కాలనీ, తేనెబండ శివారు, జానకారపల్లె, రాంనగర్ కాలనీ, ఆ ప్రాంత శివారు కాలనీల్లో సమస్య ఎక్కువగా ఉంది.



వీరభద్ర కాలనీలో అడవిని తలపిస్తున్న పిచ్చిమొక్కలు







రామ్‌నగర్‌కాలనీ శివారు ప్రాంతంలో అధ్వానంగా పారిశుద్ధ్యం, జానకారపల్లె సమీపంలో, రామ్‌నగర్‌కాలనీలో

నేడు ముందస్తు నివారణ టీకాలు

యాదమరి: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని వాటి నివారణకు ముందస్తు చర్యలుగా నేడు వ్యాధి నిరోధక టీకాల ప్రారంభం కానుందని మండల పశు వైద్యాధికారి మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ నర్రావూరు గ్రామంలో గ్రామీణ పశువైద్య కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నారు. నేటి నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు పశువులకు వ్యాక్సినేషన్ వేయనున్నట్లు చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

నాయకులకు అభినందనలు



జ్ఞాపికలు అందుకుంటున్న నాయకులు శేషాద్రిరెడ్డి, చంద్రమౌళి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఓసీ ఉద్యోగుల నాయకులను రాష్ట్ర నాయకులు అభినందించారు. విజయవాడలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం జరిగింది. అక్కడ చిత్తూరు జిల్లా పరంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చురుగ్గా ఉన్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శేషాద్రిరెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రమౌళిని రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు అభినందించి జ్ఞాపికలను అందజేశారని నాయకులు వివరించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆగవు



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాగరాజు, స్థానికులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజాసమస్యలపై పోరాటాలు ఆగవని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఇటీవల రెండోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నాగరాజును ఆదివారం స్థానిక పీహెచ్‌వాడలో ప్రాంతవాసులు సన్మానించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడారు. గత 35 ఏళ్లుగా ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్నారని కొనియాడారు. కార్మికుల సమస్యల పట్ల ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పేదల సమస్యల పట్ల ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజా, స్థానికులు, నాయకులు విజయచక్రవర్తి, సుధాకర్, అన్నామలై, ఎస్టేట్ నాయకులు జీ.డి.నాయుడు, శ్రీనివాసులు, పవన్,లక్ష్మణ్, నిఖిల్, యశ్వంత్, తీర్థ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు బస్సులేవీ..?



బెంగళూరు బస్సు ఎక్కేందుకు కుస్తీ పడుతున్న దృశ్యం



బెంగుళూరు వెళ్లేందుకు ఎదురుచూస్తున్న ప్రయాణికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బెంగళూరుకు బస్సు లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. గమ్యం చేరుకోవడానికి కుస్తీలు పడుతున్నారు. చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్లడానికి ఆదివారం బస్సు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆర్టీసీ బస్టాండులో వందలాదిమంది గంటల తరబడి నిరీక్షించారు. బెంగళూరు వెళ్లడానికి పడిగాపులు కాశారు. వచ్చిన ఆ బస్సులన్నీ కూడా తిరుపతి నుంచి కిటకిటలాడడంతో బెంగళూరు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేక బస్సులు కల్పించడంతో ఆర్టీసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ప్రతి ఆది, సోమవారాల్లో ఈ సమస్య ఎదురవుతున్న అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సంఖ్య పెరుగుతున్న ఆర్టీసీ అధికారులు ఏమాత్రం కదలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలు దిక్కుగా మారుతున్నాయని, ఇదే అదునుగా డబుల్ చార్జీలు గుంజేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

బోయకొండ కిటకిట



బారులు తీరిన వాహనాలు

- రద్దీగా మారిన క్యూలైన్లు
- స్తంభించిన ట్రాఫిక్



ప్రధాన ఆలయం నుంచి ముఖద్వారం వెలుపలి వరకు క్యూలో భక్తజనం

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరుగాంచిన బోయకొండ ఆదివారం కిక్కిరిసింది. అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన దినం కావడంతో పాటు ఇష్టదైవంగా కొలిచే కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామున 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండపై ఎటుచూసినా భక్తజన సందోహంతో రద్దీగా మారింది. అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో క్యూలు రద్దీగా మారాయి. గంటల తరబడి నిరీక్షించి భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారు 20 వేల మందికి పైగా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తెలిపారు. ఊహించని రీతిలో వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. భక్తులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు





డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, నూతన ఎస్పీ తుషార్ దూడి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, నూతన ఎస్పీ తుషార్ దూడి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనం ఏర్పాటు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేసి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్‌మోహన్, ఈఓ పెంచల కిషోర్ తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన ఎస్పీ తుషార్ దూడి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలు చేసి స్వామి ప్రసాదం అందజేశారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

కమనీయం.. నృత్యమయం



ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథా కాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆహుతులను కట్టిపడేశాయి. అద్భుత ప్రదర్శనల ఇచ్చిన కళాకారులకు భక్తులు చప్పట్లతో అభినందించారు. అనంతరం అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

- కాణిపాకం







